సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

మంగళవారం । 13 । ఆగస్టు । 2024



వైభవంగా శ్రావణ పూజలు

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కనక మహాలక్ష్మి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 8లో



ప్రత్యేక రైళ్ల పొడిగింపు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాలలో ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లను మరికొంతకాలం పొడిగించారు. 8లో



కేజీహెచ్‌లో పోలీస్ భద్రత

కేజీహెచ్‌లో భద్రతకు ఎల్లవేళలా పోలీసులు అందుబాటులో ఉంటారని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. 8లో

కమ్మేసిన పొగ మంచు



పాడేరు పట్టణంలో దట్టంగా కమ్ముకున్న పొగమంచు

రాకపోకలకు వాహనదారుల అవస్థలు ● లైట్లు వేసుకుని ప్రయాణం



పొగమంచు కారణంగా లైట్లు వేసుకుని ప్రయాణిస్తున్న వాహనం



వంజంగి హిల్స్‌పై మంచు అందాలను తిలకిస్తున్న సందర్శకులు

పాడేరు: జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణ పరిసర ప్రాంతాల్లో సోమవారం దట్టంగా పొగమంచు కమ్ముకుంది. ఇటీవల సుమారు పది రోజులకు పైగా మన్యం అంతటా భారీ వర్షాలు కురిశాయి. ఉన్నట్టుండి సోమవారం తెల్లవారు జాము నుంచి దట్టంగా పొగమంచు కమ్ముకుంది. ఉదయం 9గంటల వరకు మంచు తెరలు వీడలేదు. దీంతో వాహనదారులు కాస్త ఇబ్బందుకు పడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో లైట్లు వేసుకొని రాకపోకలు సాగించారు. సోమవారం వాతావరణం శీతకాలాన్ని తలపించింది. వర్షా కాలంలో దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు పర్యాటకులు ఒకింత ఆశ్చర్యానికి గురయ్యారు.

వంజంగిలో 'స్నో'యగం ...

సాక్షి,పాడేరు: పర్యాటక ప్రాంతం వంజంగి హిల్స్‌లో సోమవారం మంచు అందాలు కనువిందు చేశాయి.వేకువజాము నుంచే పొగమంచు దట్టంగా కురవడంతో వంజంగి కొండలను మంచు కమ్ముకుంది.ఉదయం 9గంటల వరకు వంజంగి హిల్స్‌లో మంచు అందాలతో కొద్దిపాటిగా వచ్చిన పర్యాటకులు పరవశించారు.

న్యూస్‌రీల్

అరకులో అందాల కాం'తార'



కొమ్మాది(విశాఖ): ప్రకృతికి నిలయమైన అందాల అరకు, వంతమూరు ప్రాంతాల్లో సోమవారం వేకువజామున హీరోయిన్ సప్తమి గౌడ (కాంతార సినిమా ఫేమ్) సందడి చేశారు. దర్శకుడు వేణుశ్రీరామ్ తెరకెక్కిస్తున్న తమ్ముడు అనే సినిమాకు సంబంధించి కొన్ని సన్నివేశాలను అరకులో చిత్రీకరించారు. ఈ సినిమాలో హీరోగా నితిన్ నటిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో మరో మూడు రోజులు పాటు పలు సన్నివేశాలను చిత్రీకరించనున్నట్టు చిత్రం యూనిట్ తెలిపింది. షూటింగ్ చూసేందుకు స్థానికులు పెద్ద ఎత్తున అక్కడకు చేరుకున్నారు.

'ఓపెన్ స్కూల్' వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు

గంగవరం: ఏపీ సార్వత్రిక విద్యా పీఠం టెన్త్, ఇంటర్మీడియెట్ ప్రవేశాలకు 2024–25 విద్యా సంవత్సరానికి గాను దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు తెలిపారు. ప్రవేశాలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను సోమవారం ఆయన స్థానిక ఎంఆర్సీ భవన్ వద్ద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దరఖాస్తు చేసేందుకు ఈనెల 27 చివరి తేదీ అని చెప్పారు. మరిన్ని వివరాలకు 9494006782, 9491286150 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు. వాల్ పోస్టర్ ఆవిష్కరణలో ఎంఈవో-2 టి.మల్లేశ్వరరావు, డీటీ వీరభద్రరావు, ఆర్ఐ జిలానీ, ఓపెన్ స్కూల్ కన్వీనర్ తీగల బొజ్జియ్య, ఉపాధ్యాయులు మడకం వెంకన్నదొర, ఆర్సీఆర్పీలు శివ, విజయ్‌భాస్కర్, సురేష్, మంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్-సంత్రగచ్చి మధ్య స్పెషల్

తాటిచెట్లపాలెం(విశాఖ): పండగలు, వరుస సెలవులతో పలు రైళ్లు రద్దీగా ఉండడంతో ప్రయాణికుల సౌకర్యార్థం హైదబాద్-సంత్రగచ్చి-హైదరాబాద్ మధ్య స్పెషల్ రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. హైదరాబాద్-సంత్రగచ్చి(07069) స్పెషల్ బుధవారం ఉదయం 5.30 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 7.30గంటలకు దువ్వాడ చేరుకుని, 7.32గంటలకు బయల్దేరి మరసటిరోజు మధ్యాహ్నం 12 గంటలకు సంత్రగచ్చి చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సంత్రగచ్చి-హైదరాబాద్ (07070) స్పెషల్ ఆగస్టు 15వ తేదీన మధ్యాహ్నం 3.50గంటలకు సంత్రగచ్చిలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 5.38గంటలకు దువ్వాడ చేరుకుని, 5.40 గంటలకు బయల్దేరి అదేరోజు సాయంత్రం 5.30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటాయి. ఈ స్పెషల్ రైళ్లు 17-థర్డ్ ఏసీ, 2-జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో నడుస్తాయి.

విద్యాప్రమాణాల మెరుగుకు బేస్‌లైన్ పరీక్షలు



పరీక్షలు నిర్వహిస్తున్న తీరును పరిశీలిస్తున్న ఎంఈవో సుందర్‌రావు

డుంబ్రిగుడ: విద్యాప్రమాణాలను మెరుగుపరిచేందుకు ట్యాబ్‌ల ద్వారా బేస్‌లైన్ ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహిస్తున్నట్టు డుంబ్రిగుడ ఎంఈవో శెట్టి సుందర్‌రావు తెలిపారు. సోమవారం స్థానిక కస్తూర్బా విద్యాలయంలో సుమారు 40 మంది 10వ తరగతి విద్యార్థినులకు ట్యాబ్‌ల ద్వారా బేస్‌లైన్ ఆన్‌లైన్ సీబీఎస్‌సీ సిలబస్ పరీక్షలు నిర్వహించారు. ప్రతి విద్యార్థినికి ట్యాబ్‌లు అందజేసి పరీక్షలు రాయించారు. పరీక్షల నిర్వహణ తీరును ఎంఈవో పరిశీలించి, మాట్లాడారు. ఈకార్యక్రమంలో పాఠశాల పిన్సిపాల్ కె.భవాని, కె.కుమరి, సీఆర్‌పీలు పద్మ, నాగేంద్ర, బాలు తదితరులు పాల్గొన్నారు. పరీక్షలు నిర్వహించిన సమయంలో కొన్ని ట్యాబులు సరిగా పనిచేయకపోవడంతో విద్యార్థినులు అవస్థలకు గురయ్యారు. కొత్త ట్యాబ్‌లు పంపిణీ చేయాలని వారు కోరారు.

మాతాశిశు మరణాల నివారణకు ప్రత్యేక చర్యలు

డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్ కిశోర్



ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌కు సూచనలిస్తున్న డాక్టర్ రమేష్ కిశోర్

చింతపల్లి: జిల్లాలో మాత, శిశు మరణాలనివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని రాష్ట్ర డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ జాయింట్ కమిషనర్ డాక్టర్ రమేష్ కిశోర్ అన్నారు. శనివారం సకాలంలో వైద్యం అందక తల్లి, బిడ్డ మృతి చెందిన సంఘటనపై స్పందించిన రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్, ఆరోగ్య శాఖ కార్యదర్శి కృష్ణబాయి, డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ శిరి.. సమగ్ర విచారణ చేపట్టాలని జాయింట్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సంఘటన జరిగిన గ్రామాన్ని ఆయన సందర్శించి మృతురాలి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. చికిత్స అందించిన వైద్యులను విచారించారు. ఆమెకు నర్సీపట్నం ఏరియా ఆస్పత్రి, చింతపల్లి ఏరియా ఆస్పత్రిలో అందించిన చికిత్స రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమేష్ కిశోర్ మాట్లాడుతూ గూడెంకొత్తవీధి మండలం దింతాడ గ్రామానికి చెందిన గర్భిణి వంతల పరిమళ మృతిపై ఆరోగ్యశాఖ ముంత్రి, ఆరోగ్యశాఖ కార్యదర్శి, సెకండరీ హెల్త్ డైరెక్టర్ తీవ్ర విచారం వ్యక్తం చేశారన్నారు. సమగ్ర విచారణ చేట్టాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావృతంగా కాకుండా వైద్యులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశామన్నారు. ఇకపై మాతా శిశు మరణాలు సంఘటనలు జరిగితే వైద్యులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఏరియా ఆస్పత్రిని ఆయన సందర్శించారు. ఏరియా ఆస్పత్రిలో ఎనస్థీషియా పోస్టును భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటుకానున్న వంద పడకల ఆస్పత్రి పనులు వేగవంతం చేసేందుకు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఏరియా ఆస్పత్రిలో వైద్యులు విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు తప్పవని రమేష్‌కిశోర్ హెచ్చరించారు. ఆయన వెంట పాడేరు డీసీహెచ్ డాక్టర్ కృష్ణారావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, వైద్యులు తదితరులున్నారు.

21 నుంచి విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు: విద్యార్థులకు బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించి వారిలో ఉన్న సామర్థ్యాలను గుర్తించాలని, బేస్‌లైన్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా వారిని ఎ,బి, సి,డి గ్రూపులుగా విభజించి వారి విద్యా ప్రమణాలను మెరుగుపర్చాలని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐటీడీఏలోని తన చాంబర్‌లో విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఈనెల 21న బేస్‌లైన్ పరీక్షలు నిర్వహించాలన్నారు. 17,18 తేదీల్లో స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి బేస్‌లైన్ పరీక్షల నిర్వహణపై అవగాహన కల్పించాలని సూచించారు. ప్రశ్నపత్రాల తయారీ, జవాబు పత్రాల మూల్యాంకనం పారదర్శకంగా జరగాలన్నారు. గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరచాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి పి. బ్రహ్మాజీరావు, టీడబ్ల్యూ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజని, ఎంఈవోలు కొమ్ము కృష్ణమూర్తి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఇంజినీరింగ్ పనులు పూర్తి



అర్జీలు స్వీకరిస్తున్న పీవో కట్టా సింహాచలం



ఆశ్రమ పాఠశాలను సందర్శించిన పీవో

రంపచోడవరం/మారేడుమిల్లి: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో ఇంజినీరింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం ఆదేశించారు. వివిధ శాఖల అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఏజెన్సీలో మలేరియా ప్రబలకుండా దోమల నివారణ మందు పిచికారీ చేయాలన్నారు.మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.జాబ్ కార్డు ఉన్న వారికి ఉపాధి కల్పించాలని, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో అర్జీలు స్వీకరించారు. పరిష్కార వేదికలో 47 వినతులు స్వీకరించినట్టు ఆయన చెప్పారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అందజేయాలని పోలవరం ముంపు గ్రామాలైన కత్తెనపల్లి, పెద్దగూడెం, సోమర్లపాడు, కొక్కిరి గూడెం గ్రామాల గిరిజనులు పీవోను కోరారు.

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన పీవో

మారేడుమిల్లి మండలం దేవరపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను పీవో కట్టా సింహాచలం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెనూ సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించవద్దని, జ్వరం వస్తే దగ్గరలోని పీహెచ్‌సీకి తీసుకువెళ్లాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడి ఎలా చదువుతున్నారో తెలుసుకున్నారు.

ఎమ్మెల్సీ స్థానానికి బొత్స నామినేషన్

మరో స్వతంత్ర అభ్యర్థి కూడా దాఖలు



స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, చిత్రంలో అరకు ఎంపీ తనూజారాణి, విశాఖ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ

మహారాణిపేట(విశాఖ): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి సోమవారం రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. మధ్యాహ్నం 1.45 గంటలకు మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ కలెక్టరేట్‌కు చేరుకొని ఆర్వో కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్‌కు మూడు సెట్ల నామినేషన్ పత్రాలు సమర్పించారు. బొత్సవెంట ఆయనసతీమణి బొత్స ఝాన్సీ, అరకు ఎంపీ తనూజ రాణి, మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, నగర మేయర్ హరి వెంకటకుమారి ఉన్నారు. నామినేషన్ దాఖలు చేసిన వెంటనే సంప్రదాయం ప్రకారం బొత్స సత్యనారాయణ ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, కె.కన్నబాబు, సమన్వయకర్తలు వాసుపల్లి గణేష్‌కుమార్, కె.కె.రాజు, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, పార్టీనాయకులు రవిరెడ్డి, ఈర్లె అను రాధ, డాక్టర్ జహీర్ అహ్మద్, జిల్లా పరిషత్ ఉపాధ్యక్షుడు సుంకరి గిరిబాబు, డిప్యూటీ మేయర్ కె.సతీష్, తదితరులు పాల్గొన్నారు. స్వతంత్ర అభ్యర్థిగా షేక్ షఫీ ఉల్లా తన మద్దతుదారులతో కలిసి నామినేషన్ దాఖలు చేశారు. ఒక సెట్ పత్రాలను ఆర్వోకు అందజేశారు.

ఆస్తి రూ.21.32 కోట్లు..
అప్పు రూ.2.87 కోట్లు

బొత్స సత్యనారాయణ సార్వత్రిక ఎన్నికల సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో ప్రస్తావించిన ఆస్తులతో పోలిస్తే రూ.73 లక్షల మేర పెరగ్గా.. అప్పులు రూ.95 లక్షలు పెరిగాయి. అప్పుడు రూ.1.92 కోట్ల అప్పులు ఉన్నట్టు వెల్లడించగా తాజాగా సమర్పించిన అఫిడవిట్‌లో రూ.2.87 కోట్లు అప్పులు ఉన్నట్లు పేర్కొన్నారు. తనతోపాటు తన భార్య ఆస్తులు కలిపి మొత్తం రూ.21.32 కోట్లు ఉన్నట్లు తెలిపారు. తన పేరున చర ఆస్తులు రూ.3.69 కోట్లు, భార్య పేరున రూ.4.75 కోట్లు ఉన్నట్లు వెల్లడించారు. స్థిరాస్తులు తన పేరున రూ.7.48 కోట్లు, భార్యపేరున రూ.4.46 కోట్లు ఉన్నట్లు తెలిపారు. చేతిలో తన వద్ద నగదు రూ.4.61 లక్షలు, భార్య వద్ద రూ.4.50 లక్షలు ఉన్నట్లు పేర్కొన్నారు. తన పేరున రూ.21.15 లక్షలు విలువ చేసే 31 తులాల బంగారం, భార్య పేరున రూ.2.15 కోట్లు విలువ చేసే 325 తులాల బంగారం ఉందని తెలిపారు. తన పేరున ఒక కారు, భార్య పేరున రెండు కార్లు ఉన్నట్టు అఫిడవిట్‌లో ప్రస్తావించారు.

16 నుంచి రెవెన్యూ సదస్సులు

జేసీ అభిషేక్‌గౌడ్



మాట్లాడుతున్న జేసీ అభిషేక్‌గౌడ్

సాక్షి,పాడేరు: జిల్లాలో ఈనెల 16వతేదీ నుంచి 30వతేదీ వరకు రెవెన్యూ సదస్సులను నిర్వహించేందుకు అధికారులు సిద్ధంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఎం.జె.అభిషేక్‌గౌడ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్‌లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈనెల 15వతేదీన లాంఛనంగా ప్రారంభిస్తామన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలతో పాడేరు డివిజన్‌లో ఎన్నికల కోడ్ ఉన్నందున తదుపరి ఉత్తర్వులు వచ్చిన తరువాతే సదస్సులు నిర్వహించాలన్నారు. మిగిలిన రంపచోడవరం,చింతూరు డివిజన్లలో రైతు సదస్సులు నిర్వహించి రైతుల నుంచి వినతులు స్వీకరించి వారికి తగిన న్యాయం చేయాలని తెలిపారు.గత ప్రభుత్వం జారీ చేసిన పట్టాదారు పాసుపుస్తకాలను తిరిగి తీసుకోవాలని, ప్రభుత్వ చిహ్నంతో ముద్రించిన నూతన పుస్తకాలను పంపిణీ చేయాలని ఆదేశించారు. జిల్లాలో రెవెన్యూ సదస్సుల పరిశీలకులుగా సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రత్యేక అధికారిగా నియమించడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో డీఆర్వో పద్మావతి,ఇతర అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

డీఎంహెచ్‌వో జమాల్ బాషా



రోగులను పరీక్షిస్తున్న జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్‌బాషా

పాడేరు: సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్య సమస్యలు ఏర్పడినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఉన్న ఆస్పత్రికి వెళ్లి తగిన చికిత్స పొందాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ జమాల్ బాషా తెలిపారు. మండలంలోని మినుములూరు కాఫీ కాలనీలో కార్మిక కుటుంబాల అభ్యర్థన మేరకు సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 186 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వర లక్షణాలు ఉన్న 28 మందికి మలేరియా నిర్ధారణ పరీక్షలు జరిపి, ఐదుగురికి మలేరియా ఉన్నట్టు నిర్ధారించారు. వారికి ఉచితంగా మందులను అందజేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో పలు సూచనలు చేశారు. అనంతరం పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ ఆదేశాల మేరకు మండల లీగల్ సర్వీస్ అథారిటీ, పోలీస్ శాఖ సంయుక్తంగా పరివర్తన కార్యక్రమం నిర్వహించాయి. గంజాయి సాగు, రవాణా, వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మినుములూరు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గోపాలకృష్ణ, డాక్టర్ వి.సాయిశ్రీ, ఏపీఎఫ్ డీసీ డీఎం జి.కృష్ణబాబు, రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రాజు, మండల లీగల్ సెల్ అథారిటీ సభ్యుడు తమర్భ ప్రసాద్‌నాయుడు, ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెలి సింహాద్రి, ఎంఎల్‌హెచ్‌పీలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పీవీటీజీ గ్రామాల్లో త్వరితగతిన విద్యుత్ లైన్ల పనులు



పనులను పరిశీలిస్తున్న శ్యాంబాబు

పాడేరు: జిల్లాలోని పీవీటీజీ గ్రామాల్లో పీఎం జన్‌మన్ పథకం కింద చేపట్టిన విద్యుత్‌లైన్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని విశాఖపట్నం ఏపీఈపీడీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ జి.శ్యాంబాబు ఆదేశించారు. సోమవారం ఆయన మండలంలోని ఊబపాలెం,గుడివాడ మెట్ట గ్రామాలను సందర్శించి, పీఎం జన్‌మన్ కింద చేపడుతున్న విద్యుత్ లైన్ల పనులను పరిశీలించారు. ప్రతి పీవీటీజీ కుటుంబానికి మెరుగైన విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎ.వి.ఎన్.ఎం.అప్పారావు, డిప్యూటీ ఈఈ మల్లేశ్వరరావు, విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

● పడవపై వెళ్లి..వైద్యం చేసి



నాటు పడవలో బయలుదేరుతున్న వైద్యులు



కుమ్మరిపుట్టులో ఏర్పాటు చేసిన వైద్య శిబిరం

ముంచంగిపుట్టు: గిరిజనులకు వైద్యసేవలందించాలన్న తపనతో వారు ప్రమాదానికి ఎదురెళ్లారు. జోరుగా మత్స్యగెడ్డ ప్రవహిస్తున్నా లెక్కచేయకుండా మండలంలో సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టుకు వైద్యులు, ప్రజా సంఘాల నాయకులు అతికష్టంమీద పడవపై సోమవారం చేరుకుని గ్రామస్తులకు వైద్య సేవలందించారు. శ్రీశ్రీఇన్ ప్రా సౌజన్యంతో ఆదివాసీ గిరిజన సంఘం,శారద ట్రస్టు,అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం, ప్రజా ఆరోగ్య వేదికల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న 195 మందికి ఉమ్మడి విశాఖ జిల్లా విశ్రాంతి వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రామారావు పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రజాఆరోగ్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామేశ్వరరావు మాట్లాడుతూ పరిశుభ్రత పాటించాలని, వేడి నీటినే తాగునీరుగా వినియోగించాలన్నారు. కుమ్మరిపుట్టు వద్ద వంతెన నిర్మించాలని,గిరిజన ప్రాంత అభివృద్ధికి ప్రణాళిక తయారు చేసి,ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ ఇన్ ప్రా ఎండీ ఎస్.శ్రీనివాసరావు,కిలగాడ వైద్యాధికారిణి శిరీష,లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ,గిరిజన సంఘం నేతలు ఎంఎంశ్రీను,గాసిరాందొర,నర్సయ్య,రామదాసు,కిలగాడ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● బారులు తీరిన అభ్యర్థులు



ఐటీడీఏ కార్యాలయం వద్ద బారులు తీరిన గిరిజన నిరుద్యోగ అభ్యర్థులు

పాడేరు: స్థానిక ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత డీఎస్సీ శిక్షణ కోసం దరఖాస్తుఫారాలు పొందేందుకు తొలిరోజే గిరిజన నిరుద్యోగ యువతీయువకులు పెద్ద ఎత్తున బారులు తీరారు. సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో వద్ద దరఖాస్తులు ఫారాలు ఇచ్చేందుకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేశారు. తొలిరోజు 410 మంది అభ్యర్థులు దరఖాస్తు ఫారాలను తీసుకున్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను స్వీకరించేందుకు ఈనెల 17 వరకు గడువు ఉందని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ తెలిపారు. అర్హత కలిగిన నిరుద్యోగ గిరిజన యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

క్లుప్తంగా

పశువుల వ్యాన్ పట్టివేత

అడ్డతీగల: ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు గోవులను తరలిస్తున్న వ్యాన్‌ను సోమవారం పట్టుకున్నట్టు ఎస్‌ఐ అప్పలరాజు తెలిపారు. అడ్డతీగలలోని సీతపల్లి జంక్షన్ మీదగా ఎనిమిది గోవులను మైదాన ప్రాంతానికి తరలిస్తున్న వాహనాన్ని స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్టు ఆయన చెప్పారు. పట్టుకున్న గోవులను గోకవరం వద్ద ఉన్న గోశాలకు తరలించనున్నట్టు చెప్పారు. గోవులను అక్రమంగా తరలిస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎవరైనా అక్రమంగా గోవులను తరలిస్తే ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తప్పవన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు



అక్రమ కట్టడాలను నిలుపుదల చేస్తున్న అధికారులు, పంచాయతీ కార్యదర్శులు

పాడేరు: పట్టణంలోని డివిజనల్ పంచాయతీ కార్యాలయానికి ఆనుకొని ఉన్న గ్రామ కంఠం భూమిలో ఎవరైన అక్రమ కట్టడాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని మండల ప్రజా పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్ హెచ్చరించారు. గ్రామ కంఠం భూమిలో గిరిజనేతరుడు అక్రమ కట్టడాలపై పలు ప్రజా సంఘాలు అధికారులకు ఫిర్యాదు చేశాయి. దీంతో అధికారులు స్పందించారు. ఆ కట్టడాలను తక్షణమే నిలుపుదల చేయాలని ఆదేశించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ రమేష్, పలువురు పంచాయతీ కార్యదర్శులతో నిర్మాణం చేపడుతున్న స్థలానికి వెళ్లి నిర్మాణాలను నిలుపుదల చేశారు. నిర్మాణదారులకు నోటీసులను జారీ చేశారు. అధికారుల ఆదేశాలను ధిక్కరించి నిర్మాణాలు చేపడితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

15 కిలోల గంజాయితో నలుగురి అరెస్టు

చింతూరు: కారులో తరలిస్తున్న 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన నలుగురిని అరెస్టు చేసినట్లు చింతూరు సీఐ గజేంద్రకుమార్ సోమవారం తెలిపారు. చింతూరు మండలం చట్టిలో వాహనాలు తనిఖీలు చేస్తుండగా గంజాయి పట్టుబడిందని చెప్పారు. గంజాయిని తరలిస్తున్న నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఉక్కు ఉద్యోగులపై 'పొదుపు' కత్తి.!

- ఆర్థిక ప్రయోజనాల కోతకు సిద్ధం
- ఉత్పత్తిపై దృష్టిసారించని యాజమాన్యం
- బోనస్, పీఆర్‌పీ, ఈఎల్స్ ఎన్‌క్యాష్‌మెంట్ నిలుపుదలకు మొగ్గు
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కార్మిక సంఘాలు



సాక్షి, విశాఖపట్నం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుటిల యత్నాలు ముమ్మరం చేస్తుంటే.. ఉద్యోగుల ప్రయోజనాలను దెబ్బతీసేందుకు స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం సిద్ధమవుతోంది. ప్లాంట్‌లో ఏ చిన్న ఆర్థిక సమస్య వచ్చినా ఉద్యోగులు, కార్మికుల వేతనాలు, ఇతర ప్రయోజనాలను తగ్గించడమే లక్ష్యమన్నట్టుగా వ్యవహరిస్తోంది. దీంతో స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల పరిస్థితి రోజురోజుకూ దిగజారుతోంది. 2021 జనవరిలో స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించాలనే ప్రతిపాదన వచ్చిన నాటి నుంచి ఉద్యోగుల తల రాతలు పూర్తిగా మారిపోయాయి.

ముప్పేట దాడితో నష్టాల బాట

ప్రైవేటీకరణ నిర్ణయం తర్వాత ప్లాంట్‌పై ముప్పేట దాడి ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం ఒకవైపు రా మెటీరియల్ అందించక పోవడంతో పాటు అవసరమైన రేల్వే ర్యాక్‌లు ఇవ్వకుండా కర్మాగారాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నాలు మొదలెట్టింది. మరో వైపు ఆర్థిక భారం నుంచి గట్టెక్కించేందుకే అంటూ.. ప్లాంట్‌కు సంబంధించిన ఆస్తుల విక్రయానికీ పావులు కదుపుతోంది. మరోవైపు బ్యాంకుల నుంచి రుణాలు అందకుండా చేస్తూ స్టీల్‌ప్లాంట్‌ను నష్టాల్లోకి నెట్టింది. 3 బ్లాస్ట్‌ఫర్నేసులకు గాను 2 ఫర్నేసుల్లో మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. దీంతో అనుకున్న ఉత్పత్తి లేకపోవడంతో టర్నోవర్ తగ్గిపోయింది. ప్రస్తుతం ప్లాంట్‌లో రా మెటీరియల్ నిల్వలు అడుగంటడంతో వ్యయ నియంత్రణ చర్యల్లో భాగంగా ఉద్యోగులకు సంబంధించిన ప్రయోజనాల్లో కోత విధిస్తూ పొదుపు చర్యలకు సిద్ధమవుతున్నట్టు యాజమాన్యం చెప్పకనే చెబుతోంది.

ఆర్నెళ్ల నుంచి వేతన కష్టాలు

ప్లాంట్ నష్టాల బాట పట్టడంతో ఆరు నెలలుగా ఉద్యోగులు జీతం ఒకేసారి అందుకున్న దాఖలాలు లేవు. సగం జీతం కూడా నెలాఖరున చెల్లిస్తుండడంతో ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించలేక డీఫాల్టర్లుగా మారుతున్నారు. 2017 జనవరి 1 న వేతన ఒప్పందం జరగక పోవడంతో సగటు ఉద్యోగి ప్రతీ నెలా కనీసం రూ. 10 వేల నుంచి రూ. 30 వేల వరకు నష్టపోతున్నారు.

మరిన్ని కోతలకు సిద్ధం

ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాల్లో మరింత కోత విధించేందుకు యాజమాన్యం సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అధికారులకు పెర్క్స్ తగ్గించడం, టౌన్‌షిప్‌లో నివసిస్తున్న కార్మికులకు విద్యుత్ చార్జీల పెంపు, పీఆర్‌పీ, ఈఎల్ ఎన్‌క్యాష్‌మెంట్ తాత్కాలికంగా నిలుపుదల వంటి అనేక చర్యలకు రంగం సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. దీనిపై ఉక్కు యాజమాన్యం కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖకు వారం రోజుల్లో నివేదిక అందజేయనున్నట్టు తెలుస్తోంది.

నిలిచిన సొసైటీ రుణాలు

ఇదిలా ఉండగా ఉద్యోగుల ఆర్థిక అవసరాలకు అండగా ఉండే పీఎఫ్, త్రిఫ్ట్ సొసైటీలకు యాజమాన్యం సకాలంలో నగదు చెల్లించడం లేదు. దీంతో వాటి నుంచి కూడా ఉద్యోగులకు రుణాలు నిలిచి పోయాయి. దీంతో ఉద్యోగుల ఆర్థిక కష్టాలు మరింత పెరిగిపోయాయి.

కార్మిక సంఘాల ఆగ్రహం

ఉక్కు యాజమాన్యం నిర్ణయంపై కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పటికే వేతన సవరణ జరగక అనేక సదుపాయాలు కోల్పోయిన ఉద్యోగులను పొదుపు చర్యల పేరిట వేధిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశంపై యాజమాన్యంతో అమీతుమీ తేల్చుకోవడానికి కార్మిక సంఘాలు సిద్ధమవుతున్నాయి.

గ్రామసభలు సమర్థంగా నిర్వహించాలి



సూచనలిస్తున్న రాష్ట్ర రిసోర్స్ పర్సన్ వెంకటరమణ

రాజవొమ్మంగి: మండలవ్యాప్తంగా మంగళవారం నుంచి జరుగనున్న ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆ పథకం రాష్ట్ర రిసోర్స్ పర్సన్ వెంకటరమణ డీఆర్పీలను ఆదేశించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం సోమవారం జరిగింది. మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన 1,374 ఉపాధి హామీ పనులకు చెంది ఆడిట్ జరుగుతుందని ఆయన వెల్లడించారు. రూ.15,83,23,547 మేర వేతనాలు, రూ. 5,12,53,155 మేర మెటీరియల్ రూపంలో ఖర్చు చేసినట్టు చెప్పారు. వెరసి రూ. 20.95 కోట్ల మేర ఖర్చుచేసిన నిధులకు చెంది పంచాయతీల వారీగా గ్రామ గ్రామాల్లో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. గ్రామసభల్లోనే సాధ్యమైనంత వరకు సమస్యలు పరిష్కరించుకోవాలని కోరారు. ఈ గ్రామసభల్లో ఉపాధి హామీ పనులతో పాటు సామాజిక పింఛన్ల పంపిణీ, పంచాయతీ రాజ్ పనులపై తనిఖీ చేయాలని డీఆర్పీలను ఆదేశించారు. ఈ సమన్వయ సమావేశంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు ఒడుగుల జ్యోతి, ఎంపీడీఓ/ ఉపాధి ప్రోగ్రాం ఆఫీసర్ ఎల్. యాదగిరీశ్వర్రావు, ఏపీఓ వందే సురేష్‌కుమార్ సర్పంచ్ తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రికార్డులు అప్పగించని పంచాయతీ రాజ్ అధికారులు

ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీలు జరుగుతున్న నేపథ్యంలో మండలంలో జరిగిన పనులకు సంబంధించి పంచాయతీ రాజ్ శాఖ ఇంతవరకు రికార్డులు అప్పగించలేదని ఎస్‌ఆర్పీ వెంకటరమణ అన్నారు. ఆడిట్ జరిగే లోపు అన్ని రికార్డులు అప్పగించాలని, లేని పక్షంలో ఆ తరువాత ఆడిట్ జరపడం వీలుకాదన్నారు. త్వరగా రికార్డులు అప్పగించాలని కోరారు.

రోగులతో స్నేహంగా మెలగాలి

జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త కృష్ణారావు



ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న సమన్వయకర్త కృష్ణారావు

చింతపల్లి: రోగుల పట్ల వైద్య సిబ్బంది స్నేహభావంతో మెలగాలని జిల్లా ఆస్పత్రుల సమన్వయకర్త కృష్ణారావు అన్నారు. సోమవారం మధ్యాహ్నం ఆయన స్థానిక ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్న పిల్లలు, గర్భిణుల వార్డులను పరిశీలించారు. అన్ని వార్డుల్లో కలియ తిరిగి రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. వైద్య సిబ్బంది విధులు పట్ల నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో వచ్చిన రోగులకు వైద్య సేవలు అందించాలన్నారు.

ప్రకృతి సాగుపై అవగాహన



జీవామృతాలు, కషాయాల తయారీపై అవగాహన కల్పిస్తున్న యూనిట్ ఇన్‌చార్జి ప్రసాద్

జి.మాడుగుల: మండలంలో ఎం.నిటాపుట్టు యూనిట్ ఆధ్వర్యంలో సింగర్బ పంచాయతీ ఊబల గరువు గ్రామంలో సోమవారం మండల స్థాయి ప్రకృతి వ్యవసాయ ఇన్‌పుట్స్ జీవామృతాలు, కషాయాలపై ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి, రైతులకు శిక్షణ అందించినట్టు యూనిట్ ఇన్‌చార్జి మేడ ప్రసాద్ తెలిపారు. మండల పరిధిలో 52 గ్రామైక్య సంఘాల్లో 30 గ్రామైక్య సంఘాలకు చెందిన మహిళా రైతుల చేత ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగుకు అధికారుల ఆదేశాల మేరకు ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌కు రైతులకు శిక్షణ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. రసాయలు ఎరువులు, పురుగుల మందులు వాడకుండా ఉండేందుకు సేంద్రియ ఎరువులు కషాయాలు తయారీపై అవగాహన కల్పించామన్నారు. భూమి సారవంతంగా ఉండటానికి ఘన ద్రవ జీవామృతాలు, చీడపీడలు పురుగులు, గొంగలి పరుగు, చుడిదోమ, లద్దె పురుగుల నివారణ కోసం రసాయన మందులు జోలికి పోకుండా నీమస్త్రం, బ్రహస్త్రం, తూటికాయ, కాషాయం, మీనామృతం వినియెగించడంపై శిక్షణ ఇచ్చారు. వాటి తయారీపై శిక్షణ ఇచ్చారు. ఉబలగరువు గ్రామైక్య సంఘం, మొండికోట గ్రామంలో రెయిన్ ఎలవన్స్ సబల ప్రాజెక్టు పరిధిలో ఏర్పాటు చేసిన డిజీ యూనిట్‌లో 500 లీటర్ల ద్రవజీవం తయారీ చేశారు. ద్రవజీవం లీటర్ రూ.5కు అందుబాటులో ఉంచినట్టు ఆయన చెప్పారు. ద్రవజీవం మొక్క ఎదుగదల ఎంతో ఉపయోగపడుతుందని ప్రతీ పంటకు వినియోగించవచ్చని ఆయన చెప్పారు. డివిజన్ ఎంటీ గణపతి, యూనిట్ ఇన్‌ఛార్జీలు రామలింగం, మహేశ్వరి, కృష్ణారావు, మార్కెటింగ్ ఎంటీ సుధాకర్, ఐసీఆర్‌పీలు, రైతులు పాల్గొన్నారు.

రైతులను మోసగించిన ప్రభుత్వం



రైతులతో కలిసి వ్యవసాయ పనులు చేస్తున్న సీపీఎం కార్యవర్గ సభ్యుడు చిన్నయ్య పడాల్

చింతపల్లి: రైతులకు ఖరీఫ్ సీజన్‌లో ఆర్థిక సాయమందిస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మోసం చేసిందని సీపీఎం అల్లూరి జిల్లా కార్యవర్గ సభ్యుడు భోనంగి చిన్నయ్య పడాల్ ఆరోపించారు. తాజంగి పంచాయతీ వంతమామిడి గ్రామంలో గిరి రైతులతో కలిసి వరి పొలంలో నాట్లు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో రైతులకు రూ.20 వేలు ఖరీఫ్ సీజన్‌లో ఆర్థిక సాయం అందిస్తుందని ప్రకటించడంతో ఎంతో ఆశించిన రైతాంగానికి ఆ సహాయం అందించకపోవడంతో గిరి రైతులకు నిరాశే మిగిలిందన్నారు. ప్రభుత్వం రైతులను వంచించే కార్యక్రమానికి తెరతీస్తుందన్నరు. లక్ష రూపాయల లోపు ఉన్న రైతులకు రుణమాఫీ చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. రైతులు వసుముబాలు, పడాల్, చిన్నబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో పోలీస్ భద్రత

విశాఖ సిటీ: కేజీహెచ్‌లో భద్రతకు ఎల్లవేళలా పోలీసులు అందుబాటులో ఉంటారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. సోమవారం ఆంధ్రా మెడికల్ కాలేజ్ సమావేశ మందిరంలో నవజాత శిశువుల రక్షణ నిమిత్తం వైద్యులు, విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిశువుల కిడ్నాప్‌లను నిరోధించడానికి చేపట్టాల్సిన చర్యలు వివరించారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, శిశు సంరక్షణ కేంద్రాల వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ, తల్లులకు వసతి కల్పించే గదులు వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. అనంతరం వైద్య విద్యార్థుల సమస్యలను తెలుసుకున్నారు. కేజీహెచ్ భద్రత విషయంపై వారు ప్రస్తావించగా.. ప్రైవేట్ ఆస్పత్రుల మాదిరిగా కేజీహెచ్ కూడా భద్రత కోసం సెక్యూరిటీ గార్డులను నియమించుకోవాలని సీపీ చెప్పారు. అవసరమైతే వారికి పోలీసుల ద్వారా శిక్షణ అందిస్తామన్నారు. ప్రైవేట్ సెక్యూరిటీతో పాటు ఒక పోలీస్‌ను ఎల్లవేళలా అందుబాటులో ఉంచుతామని చెప్పారు. ఆస్పత్రిలో పెట్రోలింగ్ పెంచుతామని, అనధికార పార్కింగ్ లేకుండా ట్రాఫిక్ పోలీసులతో చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆస్పత్రి ఆవరణలో పొదలు తొలగించి, భద్రత కోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. తక్కువ ఎత్తులో ఉన్న బౌండరీ వాల్ ఎత్తు పెంచాలన్నారు. ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలు పాల్పడుతున్నట్లు తెలిస్తే వెంటనే 7995095799 నెంబర్‌కు తెలియజేయాలని సూచించారు.

సమావేశంలో సమస్యల వెల్లువ



సమావేశంలో సమస్యలు తెలియజేస్తున్న సభ్యులు

రాజవొమ్మంగి: మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో సభ్యుల నుంచి అనేక సమస్యలు వెల్లువెత్తాయి. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన రాజవొమ్మంగి మండల ప్రజా పరిషత్ పాలకమండలి సాధారణ సర్వసభ్య సమావేశం సోమవారం జరిగింది. గడుఓకుర్తి సర్పంచ్ సవిరెల చంద్రుడు మాట్లాడుతు లోతట్టు పంచాయతీలోని విద్యుత్ సమస్యలను ఆ సంస్థ పట్టించు కోడంలేదని ధ్వజమెత్తారు. బూసులపాలెంలో స్కూలులో టీచర్ లేరన్నారు.దీంతో చిన్నారులు అడ్డతీగలలోని దొరమామిడికి ఆరు కిలోమీటర్ల నడచి వెళ్లి చదువుకొంటున్నారని సభ దృష్టికి తెచ్చారు. డైస్ కోడ్ లేని కారణంగా మంగంపాడు గ్రామానికి చెందిన స్కూలు పిల్లలు మూడు కిలోమీటర్ల దూరంలోని రత్నాలపాడు పాఠశాలకు నడచి వెళ్లి మధ్యాహ్నం భోజనం చేయాల్సివస్తోందని సర్పంచ్ తొంటా ఆదిరాజు వాపోయారు. ఎడతెరిపి లేని వర్షాలకు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ప్రాంగణాల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొందని, చుట్టు పిచ్చిమొక్కలు, తుప్పలు పెరిగిపోయాయని జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా జంగిల్ క్లియరెన్స్ చేయాలని కోరారు. సింగంపల్లి గ్రామంలో జేజేఎం పనులు సక్రమంగా జరుగలేదని, పైపు లైన్లు పాడయ్యాయని సర్పంచ్ ఆవూరి శుభలక్ష్మి తెలిపారు. దీంతో స్థానికులు మడేరు వాగు నీటిని వినియోగిస్తున్నారని సర్పంచ్ సభ దృష్టికి తెచ్చారు. సమస్య పరిష్కరించాలని కోరారు. పలు గ్రామాల్లో చేతి పంపు బోర్లు పాడయ్యాయని రిపేర్ చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సీతారాం దృష్టికి తెచ్చారు. గత ప్రభుత్వ హయాంలో ఈపాటికే ఆర్బీకేలకు సరసమైన ధరలకు ఎరువులు పురుగు మందులు అందుబాటులో ఉండేవని ఈ ఏడాది నేటికి రాలేదన్నారు. వరి నాట్లు పూర్తి చేసిన రైతులు ఎరువుల కోసం ఎదురుతెన్నులు చూస్తున్నారని ఇకనైనా వ్యవసాయశాఖ ఎరువులను ఆయా రైతు సేవా కేంద్రాల్లో సిద్ధంగా ఉంచాలని కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల నిర్లక్ష్యధోరణి వల్ల 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన చెత్త నుంచి సంపద కేంద్రాలకు నేటికి బిల్లులు అందలేదని పలువురు సభ్యులు ఆందోళన చేశారు. సచివాలయాల ప్రాంగణంలో నిర్మించిన టాయిలెట్స్ బిల్లులు ఎప్పుడు మంజూరు చేస్తారని, ఆ టాయిలెట్స్‌ను ఎప్పుడు ఉపయోగంలోకి తెస్తారని సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యలను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకొని వెళ్తామని ఎంపీడీఓ యాదగిరీశ్వరరావు సభ్యులకు సర్దిచెప్పారు. వైస్ ఎంపీపీలు చంద్రరాణి, రాజేశ్వరి, సర్పంచ్ రమణి, జెట్పీటీసీ సభ్యురాలు జ్యోతి, ఇన్‌చార్జి తహసీల్దార్ సత్యనారాయణ అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరయ్యారు.

వైభవంగా శ్రావణ మాస పూజలు

దాబాగార్డెన్స్(విశాఖ): శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కనక మహాలక్ష్మి దేవస్థానంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు సోమవారం నాటికి 8వ రోజుకి చేరుకున్నాయి. అమ్మవారికి వేదమంత్రాలు, నాదస్వర సుస్వరాల మధ్య ఉదయం 8.10 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభించారు. పలువురు ఉభయదాతలు విశిష్ట పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.శ్రీనివాసులరెడ్డి, ఏఈవో వెంపలి రాంబాబు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన

ఉత్తరాంధ్రుల కల్పవల్లి కనక మహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891 2711725, 2566514కు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు జమచేసి పేరు, గోత్రనామం, చిరునామాను 8985515989 వాట్సాప్ నంబర్‌కు పంపాలి. ఆన్‌లైన్ సేవలు, పూజల కోసం aptemper.ap.gov.inwebrite ద్వారా పొందవచ్చు.

భారీ జాతీయ జెండా ఊరేగింపు



జాతీయ జెండాతో నాయకులు

హుకుంపేట: హర్‌ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం హుకుంపేటలో సోమవారం 65 మీటర్ల జాతీయ జెండాతో భారీ ర్యాలీ నిర్వహించారు. బీజేవైఎం అరకు పార్లమెంట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల, కళాశాల విద్యార్థులు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాంగి రాజారాం, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు గెమ్మెలి కొండబాబు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పాంగి మత్స్యకొండబాబు,స్థానిక ప్రభుత్వ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ సిబ్బంది కిరాణ్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ వాడకంతో దుష్ప్రభావాలు



మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న జేసీ అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో అభిషేక్,విద్యార్థులు

సాక్షి,పాడేరు: మాదక ద్రవ్యాల వినియోగం దుష్ప్రభావాలకు దారితీస్తుందని, వాటికి యువత దూరంగా ఉండే లక్ష్యంతో విస్తృతంగా ప్రచారం చేయాలని జేసీ డాక్టర్ అభిషేక్‌గౌడ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. డిగ్రీ విద్యార్థులతో మాదక ద్రవ్యాల నియంత్రణకు ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ర్యాలీ జరిపారు.ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగంతో జీవితాలు నాశనమవుతాయని చెప్పారు. ఎన్‌పీడీఎస్ కింద కేసులు నమోదైతే జైలు శిక్ష పడడంతో పాటు, సమాజంలో పరువుపోయే పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. ఐటీడీఏ పీవో అభిషేక్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నిర్మూలన సామాజిక బాధ్యతని చెప్పారు. అనంతరం జేసీ, పీవోలు మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో డీఈవో పి.బ్రహ్మాజీరావు, ఎస్‌డీసీ శర్మ,తహసీల్దార్ రాజ్యలక్ష్మి,గిరిజన సంక్షేమశాఖ డీడీ కొండలరావు, ఏటీడబ్ల్యూవో ఎల్.రజిని,ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్‌బాబు,ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు డాక్టర్ గణేష్, జి.గౌరీశంకరరావు, దామోదరరావు,విద్యార్థులుపాల్గొన్నారు.

సమస్యలపై ఎంఈవోలకు వినతి





జి.మాడుగుల, చింతపల్లిలో ఎంఈవోలు బాబూరావు, ప్రసాద్, నాయుడులకు వినతిపత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

జి.మాడుగుల: పాఠశాల విద్య-పని సర్దుబాటు ప్రక్రియను ఉపాధ్యాయ సంఘాల సూచనలను పరిగణలోనికి తీసుకోవాలని ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఆర్గనైజేషన్(ఎఫ్‌ఏపీటీవో)ఏపీటీఎఫ్ చైర్మన్ ఆర్ జగన్‌మోహన్‌రావు, డీటీఎఫ్ యుటీఎఫ్ మండల అధ్యక్షుడు గంగాధరరావు, డీటీఎఫ్ మండల అధ్యక్షుడు కె నారాయణరావు, ఏపీటీఎఫ్ మండల అధ్యక్షుడు కె కైలాసం డిమాండ్ చేశారు.స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయ సంఘాల సూచనలు పరిగణలోనికి తీసుకోవాలని కోరుతూ సామవారం ఎంఈవో సీహెచ్ బాబూరావుపడాల్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు. పని సర్దుబాటు ప్రక్రియలో మండల, డివిజన్ స్థాయి వరకే పరిమితం చేయాలని కోరారు. 70శాతం పైబడి వైకల్యం కలిగిన ఉపాధ్యాయులను పని సర్దుబాటు ప్రక్రియ నుంచి మినహాయించాలని 2025 ఏప్రిల్ 30లో పదవీ విరమణ చేయ ఉపాధ్యాయులను వారి పోస్టులను పని సర్దుబాటు నుంచి మినహాయించాలని వినతిలో పేర్కొన్నారు. ప్రైమరీ పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల పోస్టులను విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా కొనసాగించాలని. ప్రాథమికోన్నత పాఠశాలల్లో జీవో 60మేరకు స్కూల్ అసిస్టెంట్ పోస్టులను కేటాయించాలని సర్దుబాటు ప్రక్రియను మండల స్థాయిలో మాన్యువల్‌గా నిర్వహించాలని తదితర డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

చింతపల్లి: పనిసర్దుబాటు ప్రక్రియలో భాగంగా పాఠశాల విద్యాశాఖ చేపడుతున్న కార్యక్రమానికి సంబంధించి ఉపాధ్యాయ సంఘాల వినతులను పరిగణలోకి తీసుకోవాలని ఫ్యాటో జిల్లా, మండల నాయకులు కోరారు. వారు సోమవారం చింతపల్లి ఎంఈఓలను కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఎంఈఓలు ప్రసాద్, బోడంనాయుడు, సంఘం నాయకులు వరలక్ష్మి, గంగరాజు, మోహన్‌రావు, రమణమూర్తినాయుడు, చిట్టినాయుడు, కామేశ్వరరావు, రాంబాబు పాల్గొన్నారు.

మరికొంత కాలం ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు మార్గాలలో ప్రస్తుతం నడుస్తున్న పలు ప్రత్యేక రైళ్లు మరికొంతకాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు.ఎర్నాకుళం-పాట్నా(06085) అన్‌రిజర్వుడు సమ్మర్ స్పెషల్ రైలు ప్రతీ శుక్రవారాల్లో రాత్రి 11గంటలకు ఎర్నాకుళంలో బయల్దేరి మరుసటిరోజు రాత్రి 11.05 గంటలకు దువ్వాడ చేరుకుని, 11.07 గంటలకు బయల్దేరి సోమవారాల్లో తెల్లవారు 3.30గంటలకు పాట్నా చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు సెప్టెంబరు 6వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో పాట్నా-ఎర్నాకుళం(06086) అన్‌రిజర్వుడు సమ్మర్‌స్పెషల్ ప్రతీ సోమవారాల్లో పాట్నాలో రాత్రి 11.45గంటలకు బయల్దేరి బుధవారాల్లో తెల్లవారుజామున 1.05గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. 1.07గంటలకు బయల్దేరి గురువారాల్లో ఉదయం 10.30గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు సెప్టెంబరు 9వ తేదీ వరకు నడుస్తాయి. కోయంబత్తూర్- బరౌని (06059) స్పెషల్ కోయంబత్తూర్‌లో ప్రతి మంగళవారాల్లో ఉదయం 11.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.48గంటలకు దువ్వాడ చేరుకుని, 10.50గంటలకు బయల్దేరి గురువారాల్లో మధ్యాహ్నం 2.30గంటలకు బరౌని చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైలు సెప్టెంబరు 3వ తేదీ వరకు నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో బరౌని-కోయంబత్తూర్ (06060) స్పెషల్ కోయంబత్తూర్‌లో శుక్రవారాల్లో రాత్రి 11.45గంటలకు బయల్దేరి మూడో రోజు తెల్లవారుజామున 3.48గంటలకు దువ్వాడ చేరుకుని, 4గంటలకు బయల్దేరి మరుసటిరోజు తెల్లవారుజామున 3.45గంటలకు కోయంబత్తూరు చేరుకుంటుంది. కోయంబత్తూర్-ధన్‌బాద్(06063) స్పెషల్ కోయంబత్తూర్‌లో ప్రతీ శుక్రవారం ఉదయం 11.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 10.50గంటలకు బయల్దేరి ఆదివారాల్లో ఉదయం 8.30గంటలకు ధన్‌బాద్ చేరుకుంటాయి. ఈ స్పెషల్ రైళ్లు సెప్టెంబరు 6వ తేదీ వరకు నడుస్తాయి. తిరుగు ప్రయాణంలో ధన్‌బాద్-కోయంబత్తూర్ ప్రతీ సోమవారాల్లో ఉదయం 6గంటలకు ధన్‌బాద్‌లో బయల్దేరి మరసటిరోజు తెల్లవారు 3.58 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 4గంటలకు బయల్దేరి బుధవారాల్లో తెల్లవారుజామున 3.45 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటాయి. సెప్టెంబరు 9వ తేదీ వరకు నడుస్తాయి. తిరునల్వేలి-షాలిమర్ (06087) స్పెషల్ ప్రతీ గురువారాల్లో తెల్లవారు 1.50గంటలకు తిరునల్వేలిలో బయల్దేరి మరుసటిరోజు తెల్లవారు 4.57గంటలకు దువ్వాడ చేరుకుని అక్కడ నుంచి 5.02గంటలకు బయల్దేరి శుక్రవారాల్లో రాత్రి 9గంటలకు షాలిమర్ చేరుకుంటాయి.